క్లుప్తంగా

ట్రాఫిక్ సీఐగా నిత్యబాబు



ఎస్పీని కలిసిన నిత్యబాబు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ట్రాఫిక్ సీఐగా నిత్యబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎస్పీ రిషాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐలకు సీఐలుగా ఉద్యోగోన్నతి కల్పించింది. అందులో భాగంగా ఆయన చిత్తూరు ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.

ముళ్లచెట్ల తొలగింపు పనుల్లో విద్యార్థులు



పాఠశాల ఆవరణను విద్యార్థులతో శుభ్రం చేయిస్తున్న ఉపాధ్యాయుడు

తవణంపల్లె: మండలంలోని బాపినాయుడుపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణంలో శనివారం మధ్యాహ్నం భోజనం విరామం సమయంలో ముళ్ల చెట్లు తొలగించి శుభ్రం చేశారు. పాఠశాలలో 13 మంది పిల్లలు చదువుతున్నారు. పారిశుధ్య పనుల కోం ప్రభుత్వం ఆయాను నియమించింది. ఆయాకు ప్రతి నెలా గౌరవవేతనం కూడా చెల్లిస్తున్నారు. కానీ ఉపాధ్యాయుడు విద్యార్థులతో ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లను తొలగించే పనులు చేపట్టారు. దీనిపై ఎంఈఓలు హేమలత, త్యాగరాజుల రెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనలు మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇంకుడుగుంతలు తప్పనిసరి



జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ఎంపీడీఓ గౌరి, సిబ్బంది

పూతలపట్టు: ఇంకుడుగుంతలను తప్పనిసరిగా నిర్మించుకోవడం వల్ల ఇళ్లలో నుంచి వచ్చే మురుగునీటి బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎంపీడీఓ గౌరి అన్నారు. ఆమె శనివారం మండలంలోని అనంతాపురం గ్రామ లేఅవుట్‌లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుకు ఇంకుడుగుంత కోసం రాష్ట్ర ప్రభుత్వం 6000 రూపాయలను అందజేస్తుందని తెలిపారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేస్తే బిల్లులు ఖాతాల్లో జమ కావని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, వర్క్ ఇన్‌స్పెక్టర్ స్టాన్లీ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి పెద్దపీట



మాట్లాడుతున్న డీడీ రాజేశ్వరి

ఐరాల: రాష్ట్రంలో విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా సాంఘీ సంక్షేమ శాఖ డీడీ రాజేశ్వరి అన్నారు. ఆమె శనివారం స్థానిక ఉన్నత పాఠశాల, బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత బాలుర హాస్టల్‌లో సిబ్బంది హాజరుకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. బాలురకు ఏర్పాటు చేసిన భోజన నాణ్యతను రుచి చూశారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. డీడీ మాట్లాడుతూ ప్రభుత్వం నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చివేసిందని, పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తోందన్నారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ



బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు శనివారం ఉచితంగా రైటింగ్ ప్యాడ్స్(అట్టలు) అందజేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని చిల్లగుండ్లపల్లెకు చెందిన మాజీ ఎంపీపీ సుగుణాకర్‌రెడ్డి కుమారుడు కిషోర్‌కుమార్‌రెడ్డి 120 మందికి ప్యాడ్స్, అల్పాహారం అందజేశారు.

అన్నదానం: చిత్తూరులో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు, గుడిపాలలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బంగారుపాళెంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, చిత్తూరులో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి






మరపురాని మహానేత వైఎస్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని జ్ఞాపకంగా మిగిలిపోయారు. ఆయన వర్ధంతి సందర్భంగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆయనకు ఘన నివాళి అర్పించారు. విరివిగా అన్నదాన, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- వాడవాడలా వైఎస్సార్‌కు ఘన నివాళి
- విరివిగా అన్నదానాలు
- శ్రీరంగంపల్లెలో విగ్రహావిష్కరణ




గుడిపాల: శ్రీరంగంపల్లెలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు: సంతపేటలో వైఎస్సార్ చిత్రపటానికి హారతి ఇస్తున్న భూపేష్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్/అర్బన్: మహానేత వైఎస్సార్ 14వ వర్ధంతి సందర్భంగా వాడవాడలా సేవా కార్యక్రమాలు చేశారు. ఆయన చేసిన సేవలను స్మరించుకుని పుష్పాంజలి ఘటించారు. నగరంలోని డీసీసీబీ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో గజమాల వేసి నివాళి అర్పించారు. జెడ్పీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ రమ్య పుష్పాంజలి ఘటించారు. ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్, పాతకోర్టు సర్కిల్ వద్ద మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్‌ల ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే, మేయర్ చేతులమీదుగా అన్నదానం చేశారు. సంతపేట కూడలిలో నాయకులు భూపేష్ ఆధ్వర్యంలో నివాళి అర్పించి అన్నదానం చేశారు. పాతకోర్టు వద్ద వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సూర్యప్రతాప్ ఆధ్వర్యంలో నివాళి అర్పించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

స్థానిక దొడ్డిపల్లెలో కార్పొరేటర్ సునీత ఆధ్వర్యంలో నివాళి అర్పించి, అన్నదానం చేశారు. ఆర్టీసీ 2వ డిపో గ్యారేజ్‌లో అన్నదానం చేశారు. సత్యనారాయణపురంలో యువనాయకులు బీకే రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించి, విజయానందరెడ్డి చేతులమీదుగా అన్నదానం చేశారు. చిత్తూరు రూరల్ మండలం అనంతాపురంలో జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు వైఎస్సార్‌కు నివాళులర్పించారు. కొత్తగామంజూరైన పింఛన్లను అందజేశారు.

శ్రీరంగంపల్లిలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ

గుడిపాల: మండలంలోని శ్రీరంగంపల్లె గ్రామంలో సర్పంచ్ మణి అధ్యక్షతన నూతనంగా ఏర్పాటుచేసిన వైఎస్సార్ విగ్రహాన్ని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించి, అన్నదానం చేశారు. బసవాపల్లెలో వైఎస్‌కు నివాళులర్పించి అల్పాహారం ఏర్పాటు చేశారు. పానాటూరు పంచాయతీలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ప్రజల గుండెల్లో కొలువైన రాజన్న

బంగారుపాళెం: నిరుపేదల గుండెల్లో రాజన్న కొలువై ఉన్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండల కేంద్రంలో రాజన్న చిత్రపటానికి ఎమ్మెల్యే, నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద అన్నదానం చేశారు. కరిడివారిపల్లెలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొగిలివెంకటగిరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తులసీరామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోటలో సర్పంచ్ పద్మజారాణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. నాయకులు రాజారత్నంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో ఎంపీపీ కుమారి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అన్నదానం చేశారు.

చిరస్మరణీయుడు వైఎస్ రాజశేఖర రెడ్డి

తవణంపల్లె: చిరస్మరణీయుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సి.హరిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. మత్యం క్రాస్‌లో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, యువకులు నివాళులర్పించారు.

యాదమరి: మండలంలోని పేరకూరులో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వైఎస్సార్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు.



పూతలపట్టు: నివాళులర్పిస్తున్న ఎంపీపీ కుమారి

ఐరాల: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుండ్లపల్లె, పాలకల, ఎం.పైపల్లె, వైఎస్ గేటు, పాలకల సంతగేటు, కాణిపాకంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించి, అన్నదానం చేశారు. తాళంబేడువారిపల్లె సహృదయ ఓల్డేజ్ హోమ్‌లో కూరగాయలు పంపిణీ చేశారు.






చిత్తూరు: పాతకోర్టు వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, మేయర్ అముద, జ్ఞానజగదీష్, ఐరాల: కూరగాయలు అందజేస్తున్న బుజ్జిరెడ్డి, తవణంపల్లె: నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, యాదమరి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఇంటివద్దకే రేషన్ పంపిణీ

గుడిపాల: గర్భిణులు, బాలింతలకు ఇంటివద్దకే టేక్‌హోమ్ రేషన్ పంపిణీ చేయనున్నట్లు వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్, ఎంపీటీసీ విజయకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత తెలిపారు. పశుమంద, పల్లూరులో శనివారం గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం ఇంటికే పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తల్లి, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. అంగన్‌వాడీలకు వెళ్లి భోజనం చేయడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నందున ఇకపై ఇంటికే నేరుగా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్కరికి పదిరకాల సరుకులతో పోషకాహారం అందజేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ పోషణ కిట్ ఇస్తున్నట్లు వివరించారు. ఈ వైఎస్సార్ పోషణ కిట్‌లో మూడు కిలోల బియ్యం, వంటనూనె అరలీటర్, పాలు 5లీటర్లు, కిలో కంది పప్పు, వేరుశనగ చిక్కి, రాగిపిండి రెండు కేజీలు, అటుకులు కేజీ, కోడిగ్రుడ్లు 25, ఎండుఖర్జూర 250 గ్రాములు, బెల్లం 250 గ్రాములు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ పావని, వైద్యసిబ్బంది జబసెల్వి, శాంతకుమారి, ఉమామహేశ్వరి, ప్రియాంక,అంగన్‌వాడీ టీచర్లు కల్పన, భారతి, రాజేశ్వరి పాల్గొన్నారు.



కిట్‌లను అందజేస్తున్న సూపర్‌వైజర్ స్వర్ణలత

ఉనికి కోసం టీడీపీ చిల్లర రాజకీయాలు

బంగారుపాళెం: తెలుగుదేశం పార్టీ ఉనికిని చాటుకునేందుకే ఆ పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలను చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురద జల్లే నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. గురువారం నిర్వహించిన మండల సర్వసభ సమావేశంలోకి 170 గొల్లపల్లె సర్పంచ్ ప్రకాష్ నాయుడు యాచకుడి వేషంలో వచ్చి పథకం ప్రకారం రభస చేశారని చెప్పారు. వైస్‌ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ, మండల సర్వసభ సమావేశంలో ఎంపీటీసీ సభ్యుల ద్వారా సర్పంచులు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. సర్పంచ్ ప్రకాష్‌నాయుడు సమావేశంలో వ్యవరించిన తీరు ఇతర సభ్యులకు ఇబ్బందిగా మారిందన్నారు. జెడ్పీటీసీ సోమశేఖర్ మాట్లాడుతూ, సభలో ఆటంకం కలిగించిన సర్పంచ్ ప్రకాష్‌నాయుడుపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి, కురబ, ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు అమరనాథ్, ఎల్లప్ప, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరుకు త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు

చిత్తూరు రూరల్: చిత్తూరుకు త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు తీసుకొస్తున్నామని అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని పెన్షనర్ భవనంలో శనివారం చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. వేలూరు, తిరుపతికి రెఫర్ చేయకుండా అన్ని రకాల సేవలు అందాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని దశల వారీగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. త్వరలో సూపర్ స్పెషాలిటీ సేవలు తీసుకొస్తామన్నారు. సత్య, శివకుమార్, సాధిక్, కుమరేషన్, మురళి, శ్రీదేవి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించేందుకే ట్యాబ్‌లు



ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేసిన అధికారులు

గుడిపాల: నాణ్యమైన విద్యను అందించేందుకే విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు జిల్లా నోడల్ అధికారి సుధాకర్ అన్నారు. నరహరిపేట పాఠశాలలో శనివారం విద్యార్థులకు అందించిన బైజూస్ ట్యాబ్‌లు కొన్ని మరమ్మతులకు గురికావడంతో వాటిని టెక్నికల్ టీమ్‌తో ట్యాబ్‌లను యాక్టివేట్ చేశారు. 9వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించి సాఫ్ట్‌వేర్ లోపాలను సరిచేశారు. నరహరిపేట, శ్రీరంగంపల్లెలో జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 27 ట్యాబ్‌లను బాగు చేసి అందజేశారు. ఎంఈవో రాజేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సీఆర్‌పీ వెంకటేష్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై 'కళాజాత'

బంగారుపాళెం: మండలంలోని కీరమంద, బంగారుపాళెం గ్రామాల్లో శనివారం ఆర్థిక అక్షరాస్యతపై జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. బ్యాంకుద్వారా అందిస్తున్న పథకాలు, పంట రుణాలు, మహిళా సంఘ సభ్యులకు పొదుపు రుణాలు, బంగారంపై అందిస్తున్న రుణాలు, సామాజిక భద్రత పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు పీఎం సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన, సైబర్ మోసాలు, నగదు రక్షత లావాదేవీలపై ప్రజలకు అర్థమయ్యేలా కళాజాత బృందం ప్రదర్శనలిచ్చింది. సింగిల్ విండో అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి,బ్యాంకు మేనేజర్ గంగిరెడ్డి, సీఈఓ రామూర్తి, బాంకు సిబ్బంది, కర్నూలు కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృందం ప్రదర్శన

వైద్య సేవల్లో నర్సింగ్ కీలకం

చిత్తూరు రూరల్: వైద్య సేవల్లో నర్సింగ్ కూడా కీలకమని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్ బాబునాయుడు అన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో శనివారం ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపు సభను నిర్వహించారు. సీఎంసీ బీఎస్సీ విద్యార్థులు వారంరోజుల పాటు గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు, మాత్రలు ఇచ్చారు. శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ నర్సింగ్ అనేది వృత్తి కాదని, అదొక్క బాధ్యతన్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రజని, సీఎంసీ నిర్వాహకులు నిర్మల, తామరైసెల్వి, జాన్ వెల్సీ, నాయకులు కుమార్, మణిబాబుపిళ్లై, వెంకటేష్, సురేష్, రాజేంద్ర, రామ్మూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు

'నా భూమి-నా దేశం'తో అమృతవనం

గుడిపాల: 'నాభూమి- నాదేశం' కార్యక్రమంలో భాగంగా సేకరించిన మట్టితో ఢిల్లీలో అమృతవనం నిర్మించనున్నట్లు బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు తెలిపారు. ఆయన శనివారం చీలాపల్లెలో మండల పార్టీ అధ్యక్షుడు సోమనాథగౌడ్ ఆధ్వర్యంలో నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏలుమలై, కుమార్‌బాబు, చంద్రన్, శేఖర్, శరవణలు పాల్గొన్నారు.

108లో ప్రసవం



ప్రసవించిన బిడ్డతో 108 సిబ్బంది

చిత్తూరు రూరల్: మండలంలోని ముత్తుకూరు గ్రామ సమీపంలో శనివారం 108 వాహనంలో 2గర్భిణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ముత్తుకూరుకు చెందిన గర్భిణి కల్పనకు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారమిచ్చారు. వెంటనే గ్రామానికి చేరుకున్న 108 బృందం ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఊరు దాటగానే నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ ప్రదీప్, పైలెట్ ప్రదీప్‌కుమార్ స్పందించి ప్రసవం చేయగా ఆడబిడ్డ పుట్టింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వారు తెలిపారు.

అర్హులందరికీ ముంగిట్లోకే సంక్షేమ పథకాలు

యాదమరి: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముంగిట్లోకి చేరుతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని 184 గొల్లపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన పథకాల లబ్ధిని గ్రామీణ ప్రజలకు వివరించారు. అనంతరం అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన వెంటనే అన్ని వర్గాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. నవరత్నాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఫలాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ఇంటికే చేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, సర్పంచ్ పరంధామ గౌడ్, ఎంపీటీసీ రంబా రాధాకృష్ణ, నాయకులు కబీర్‌బాషా, కార్తిక్ రెడ్డి, గజేంద్ర యాదవ్, శేఖర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పేరకూరులో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

సద్వినియోగం చేసుకోండి

పూతలపట్టు: మధ్యాహ్న భోజనాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు అన్నారు. ఆయన శనివారం పి.కొత్తకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా? అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, సర్పంచ్ పద్మజరాణి, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దనే వైద్యం

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణ ప్రజల ముంగిట్లోనే వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారులు దాత్రేయచౌదరి, డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని టి.పుత్తూరులో డాక్టర్ దాత్రేయచౌదరి, పైమాఘంలో డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. 97 మంది రోగులకు వైద్య పరీలు నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు నిర్మలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు పావని, రోజా, డిఈఓ విజయలక్ష్మి, రవికుమార్, ఆశావర్కర్లు నగభూషణం, సౌందర్య, పుష్ప పాల్గొన్నారు.

బసవాపల్లెలో..

గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని ప్రాథమిక వైద్యాధికారి సందీప్ అన్నారు. బసవాపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. 63 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే సేవలను అందించారు. వైద్య సిబ్బంది విజయ, చంద్ర, రోస్లిన్, కోమల, కోకిల, పంకజ పాల్గొన్నారు.